క్లుప్తంగా

ముక్కంటికి వంటపాత్రల సమర్పణ



ఆలయానికి వితరణ చేసిన వంటసామగ్రి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నెల్లూరుకు చెందిన మురళీకృష్ణ హోటల్స్ అధినేత సుబ్బారావు రూ.8లక్షల విలువ చేసే వంటపాత్రలను పాలకమండలి చైర్మన్‌అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు మల్లికార్జునప్రసాద్, మునిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీవాగ్రంలో రేపు వాలీబాల్ టోర్నమెంట్

రేణిగుంట: గ్రామాల్లోని యువకుల ప్రతిభను వెలికితీసేందుకు ఆదివారం రేణిగుంట మండలం జీవాగ్రం పీఎం హైస్కూల్ మైదానంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆషా సంస్థ అధ్యక్షుడు జూలియస్‌రాజు శుక్రవారం తెలిపారు. చిత్తూరు నెహ్రూ యువజన కేంద్రం , తమ సంస్థ సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన జట్లు డాక్టర్ సుధాకర్ (9849473373) నంబరును సంప్రదించాలన్నారు.

డీడీఓకు సన్మానం



డీడీఓని సన్మానిస్తున్న రామచంద్రయ్య, వలంటీర్లు

శ్రీకాళహస్తి రూరల్: గణ తంత్ర దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకున్న చల్లపాళెం సచివాలయం డీడీఓ యూసఫ్‌ఖాన్‌ను శుక్రవారం చల్లపాళెం, చల్లపాళెం బీసీకాలనీ, రాచగున్నేరి, చటర్జీనగర్ గ్రామాల ప్రజలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి, రాచగున్నేరి ఉప సర్పంచ్ రామచంద్రయ్య ఆయన సేవలను ప్రస్తుతించారు.

మృతదేహాల అప్పగింత

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సాయి రాధా బయోటెక్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకుల మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు. గురువారం ఫ్యాక్టరీలోని కెమికల్ వేస్టేజీ ఆయిల్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సమయంలో పిల్లపాలెం దళితవాడకు చెందిన నరేంద్ర, వెంకటేష్ ఊపిరాడక మృతిచెందడం విదితమే. అయితే ఈ కేసుకు సంబంధించి ఫ్యాక్టరీ యాజమాన్యం మృతుల బంధువులతో చర్చించి, 10 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దివాకర్‌బాబు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి దివాకర్‌బాబు కోరారు. శుక్రవారం లక్ష్మీపురం గిరిజన కాలనీలో ఆయన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 45 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్రమణ్యం, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మీరంతా జగనన్న సైనికులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



హాజరైన గృహ సారథులు, గ్రామ వలంటీర్లు

- సేవా దృక్పథంతో ప్రజలకు సేవ చేయండి
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు

వరదయ్యపాళెం: జగనన్న సైనికులుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లకు ఎమ్మెల్యే శిక్షణా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామ సచివాలయా వ్యవస్థ ఏర్పాటుతో విప్లవాత్మక మార్పులకు సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. వారికి తోడు 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున గృహ సారథులను ఎంపిక చేశామన్నారు. వీరంతా గ్రామ వలంటీర్లతో అనుసంధానమై ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వీరిని పర్యవేక్షించడానికి సచివాలయ కన్వీనర్లు, మండలస్థాయి కన్వీనర్ ఉంటారన్నారు. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవా దృక్పథంతో ప్రజలకు సేవ చేయాలని కోరారు. అనంతరం మండల గ్రామ సచివాలయాల కన్వీనర్లకు ఇన్‌చార్జ్ కన్వీనర్‌గా నియమితులైన వరదయ్యపాళెం మాజీ సర్పంచ్ చిన్నాను శాలువా, గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండలాల కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), విద్యానాథరెడ్డి (బీఎన్ కండ్రిగ), జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, మాజీ సర్పంచులు చిన్నా, తిలక్‌బాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సిద్ధిక్ పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాల మండల కన్వీనర్‌గా చిన్నా

మండలంలోని గ్రామ సచివాలయాల కన్వీనర్‌గా వరదయ్యపాళెం మేజర్ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ కె.చిన్నా (వెంకటయ్య)ను నియమించారు. గృహ సారథుల శిక్షణ సమావేశంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సమక్షంలో చిన్నాను ఎంపిక చేశారు.

'యువగళం'తో ఒరిగేదీ లేదు

తాను సీఎం కావాలన్న దుగ్ధతో ప్రతిపక్షనేత, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజలను రెచ్చగొట్టేందుకు తన కుమారుడు లోకేష్‌ని యువగళం పేరుతో రోడ్డెక్కించారని, దీని వల్ల వారికి ఒరిగేదేమీ లేదని ఎమ్మెల్యే ఆదిమూలం వ్యాఖ్యానించారు. 400 మంది బౌన్సర్లు రోప్‌లు అడ్డం పెట్టి రథాన్ని లాక్కుని పోయినట్లు లోకేష్ పాదయాత్రను లాక్కుని పోతున్నారని అపహాస్యం చేశారు. పాదయాత్రతో లోకేష్‌కు ఆయాసం తప్ప సాధించేదీ లేదన్నారు.

మౌలిక వసతులు కల్పించరూ!

- ఎమ్మెల్యేకు గోపాలరావుకాలనీ వాసుల వినతి



గోపాలరావుకాలనీలో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న ముస్లిం మైనారిటీలు

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని గోపాలరావుకాలనీలో మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పాటైన ఈ కాలనీలో పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు, విద్యుత్ లైన్లు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు కోరారు. శుక్రవారం గోపాలరావుకాలనీ, బీసీకాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలతో మాట్లాడారు. సంక్షేమ పథకాలు, గ్రామ వలంటీర్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు నివేదించిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత ముస్లిం మైనారిటీలు గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, మాజీ సర్పంచులు చిన్నా, తిలక్‌బాబు, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ బుజ్జమ్మ, వక్ఫ్ బోర్డు కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరునికి ప్రదోష పూజలు



సురుటుపల్లెలో నందీశ్వరునికి అభిషేకం చేస్తున్న ప్రధాన అర్చకులు



శివపార్వతుల ప్రాకారోత్సవం

- పళ్లికొండేశ్వరాలయంలో పోటెత్తిన భక్తులు

పిచ్చాటూరు: త్రయోదశి పురస్కరించుకుని నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం నందీశ్వరునికి ప్రదోష పూజలు ఘనంగా నిర్వహించారు. పక్షం రోజులకోసారి వచ్చే త్రయోదశి నాడు ఈ ఆలయంలో శివునికి ప్రీతిమంతుడైన నందీశ్వరునికి ప్రదోష పూజలు భక్తుల నడుమ వైభవంగా నిర్వహించడం పరిపాటి. సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వరస్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పంచామృతం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పండ్లను నైవేద్యంగా సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో మరగదాంబిక సమేత వాల్మీకేశ్వర స్వామి, మంగళాదేవి సమేత పళ్లికొండేశ్వర స్వామి, దాంపత్య దక్షిణామూర్తి, రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి అందంగా అలంకరించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులకు ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు ఆనంద్, ఎస్ఎం సురేష్, మంజుల, మునివేలు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

పాడి రైతుల అభ్యున్నతికి ఎమ్మెల్యే కృషి

- రామలింగాపురంలో పాడి రైతులకు ప్రోత్సాహకాలు పంపిణీ



పాడి రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న పాల సొసైటీ చైర్మన్, సర్పంచ్

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పాడి రైతుల అభ్యున్నతికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కృషి చేస్తున్నారని శ్రీకాళహస్తి పాల సొసైటీ చైర్మన్ మునగాల మధుసూదన్‌రావు అన్నారు. శుక్రవారం రామలింగాపురంలో సర్పంచ్ పోలంరెడ్డి భక్తకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్ పాడి రైతుల ఇళ్లకు వెళ్లి ప్రోత్సాహకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో పాల సొసైటీని దివాలా తీయించిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి, తీసుకున్న చర్యల మూలాన ప్రస్తుతం లాభాల బాటలో పయనిస్తోందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో సుమారు 30 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం, పశు వైద్యాధికారులు అందుబాటులో ఉండటం వలన పాడి పోషణ, సంరక్షణకు సరైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అంతేకాకుండా ఇప్పుడు పశువుల మరణాల సంఖ్య కూడా చాలా వరకు తగ్గిందని పేర్కొన్నారు.

వారపు సంత పనులు ముమ్మరం



నూతన సంత ఏర్పాటుకు పనులు చేస్తున్న కూలీలు

ఏర్పేడు: మండలంలోని కందాడులో వారపు సంత కోసం శుక్రవారం సర్పంచ్ శ్రీదేవి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా పనులు చేశారు. కందాడు, సరస్వతికండ్రిగ, ఎలకమిట్ట ఎస్టీ, పాత, కొత్త ఎస్సీ కాలనీలు, సదాశివపురం, శివగిరి ఎస్టీ కాలనీ, మడిబాక, ఎండీపుత్తూరు తదితర గ్రామాల ప్రజలు నిత్యావసర సరకులు, కూరగాయలు, ఆకుకూరల కోసం శ్రీకాళహస్తి, రేణిగుంటలో జరిగే సంతకు వెళ్లి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు, ప్రజల సౌకర్యార్థం సంతను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 5న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

త్రిశూల ఏటి ఉత్సవం రేపు



స్వర్ణముఖి నది వద్ద చేస్తున్న ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: మాఘపౌర్ణమి సందర్భంగా శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నదికి ఆదివారం త్రిశూల ఏటి ఉత్సవం నిర్వహించనున్నారు. పంచమూర్తులను ఊరేగింపుగా స్వర్ణముఖి నదీతీరంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో త్రిశూలానికి పవిత్ర జలాలతో స్నానం నిర్వహిస్తారు. భక్తులు త్రిశూలంతో పాటు స్వర్ణముఖిలో స్నానమాచరించి శివయ్య కటాక్షం పొందాలని పరితపిస్తుంటారు. ఈసారి ఉత్సవం కోసం ప్రత్యేకంగా నాలుగు పక్కల మెట్లు కలిగిన కొలను ఏర్పాటు చేశారు.

శ్మశాన వాటికల్లో చేతిపంపులు ప్రారంభం



చేతిపంపును ప్రారంభిస్తున్న శివయ్య

ఏర్పేడు: స్థానిక పంచాయతీ పరిధిలోని శుక్రవారం మూడు శ్మశాన వాటికల్లో చేతిబోర్లను సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గత వారం మూడు బోర్లు డ్రిల్ చేసి హెడ్‌లు అమర్చారు. శుక్రవారం వాటిని ప్రారంభించి నీటి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్ర ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణారెడ్డి, సర్పంచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం





శ్రీకాళహస్తి రూరల్ : అబ్బాబట్లపల్లె ఎస్టీ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, అముదూరులో..

శ్రీకాళహస్తి రూరల్: బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరమని ప్రజా ప్రగతి ట్రస్ట్ శ్రీకాళహస్తి డివిజన్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మండలంలోని అబ్బాబట్లపల్లె, వేడాం, ఎగువవీధి, సుబ్బానాయుడుకండ్రిగ ఎస్టీ కాలనీల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చదువుకోవాల్సిన వయస్సులో బాల్యవివాహాలు చేస్తే శారీరక, మానసికపరంగా అనర్థాలు చవిచూడాల్సి వస్తుందని గ్రహించాలన్నారు. బాల్యవివాహాలకు స్వస్తి పలికి ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని విజ్ఞప్తి చేశారు. బాల్యవివాహాలు ఎక్కడైనా చేస్తున్న పక్షంలో వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. వీటిని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే చైల్డ్‌లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100కు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని అన్నారు. పాఠశాల దశ నుంచి విద్యార్థినులకు కరాటే నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో వేడాం సర్పంచ్ రమణయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శులు మమత, మాధవి, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, అంగన్‌వాడీ కార్యకర్త మహేశ్వరి, చెంచు రామిరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అముదూరులో..

ఏర్పేడు: బాల్యవివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావనశ్రీ అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై గురువారం మండలంలోని అముదూరు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహాలు జరగకుండా అరికట్టాలని కోరారు. అలాంటి వివాహాలతో అనర్థాలు జరుగుతాయని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త అశోకరాణి, మహిళలు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సంజన



సంజనను అభినందిస్తున్న బాలికోన్నత ప్లస్ హైస్కూల్ హెచ్‌ఎం విష్ణువర్ధనం

రేణిగుంట: స్థానిక బాలికోన్నత ప్లస్ స్కూల్‌కు చెందిన ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యార్థి సంజన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం విష్ణువర్ధనం శుక్రవారం తెలిపారు. ఈనెల ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు జమ్మూకశ్మీర్ గుల్‌మార్గ్‌లో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సంజన పాల్గొంటుందని చెప్పారు. పోటీల్లో రాణించి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ రేఖారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



నళినీమోహన్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నళినీమోహన్ తన కుటుంబ సభ్యులతో శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

శిథిలావస్థకు చేరుతున్న సంరక్షణ భవనం



శిథిలమైపోతున్న సంరక్షణ భవనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లెలోని గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన సంరక్షణ కేంద్ర భవనం నిరుపయోగమై శిథిలావస్థకు చేరుతోంది. దీంతో బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి మరమ్మతులు చేయాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులైనా స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నూతన కాజ్‌వే నిర్మాణానికి భూమిపూజ



నూతన కాజ్‌వేకు హిటాచీతో పనులు ప్రారంభిస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం సమీపంలో స్వర్ణముఖి నదిపై నూతన కాజ్‌వే నిర్మాణానికి శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గున్నేరి కిషోర్‌రెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గతంలో నిర్మించిన కాజ్‌వే దుస్థితికి చేరుకోవడంతో మోదుగులపాలెం, సదాశివపురం, వెంకటాపురం, కుమ్మరిమిట్ట, కుక్కలవారికండ్రిగ, మడిబాక, కందాడు, ఎండీపుత్తూరు తదితర గ్రామాల ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, లారీలు, పాదచారులు వర్షాకాలంలో వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. సమస్యను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి నివేదించడంతో ఆయన స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి కాజ్‌వే నిర్మాణానికి సుమారు రూ.1.5 కోట్లు మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్‌ఎంపీపీ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్ జయరామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రాజేంద్ర, లోకనాథరెడ్డి, సురేఖ, కృష్ణయ్య, చెంగల్రాయులు, రాందాసు, యుగంధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన





ఉచిత కంటి వైద్యశిబిరంలో పరీకిస్తున్న వైద్యులు, హాజరైన స్థానికులు

వరదయ్యపాళెం: స్థానిక గ్రామ సచివాలయ ప్రాంగణంలో స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ శుక్రవారం శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వైద్యులతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 164 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆపరేషన్లకు 66 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మావుడూరు మోహన్, డైనమిక్ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు రామసుబ్బయ్య, మోహనరావు, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు గుత్తి త్యాగరాజు, ఎంటెక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సాదర వీడ్కోలు



జవహర్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న అధికారులు

రేణిగుంట: వైఎస్సార్ జిల్లా పర్యటన ముగించుకుని శుక్రవారం రాత్రి 9.5గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డికి అధికారులు సాదర వీడ్కోలు పలికారు. వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్ వర్మ, కడప మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాతో కలసి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఇక్కడ జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ బాలాజి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు తదితరులు వీడ్కోలు పలికారు.

డ్రైనేజీలో పసికందు శవం



శ్రీకాళహస్తి: పట్టణంలోని మురుగునీటి కాలువలో నెలలు నిండని పసికందు శవంగా ప్రత్యక్షమైంది. స్థానికుల కథనం శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలో పురపాలకసంఘ డ్రైనేజీ కాలువలో పసిబిడ్డ మృతదేహం కొట్టుకువచ్చింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఉత్సవాల విజయవంతానికి సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల విజయవంతానికి అందరూ సహకరించాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. ఆలయ పరిపాలన భవనంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతియేటా నిర్వహించే శివరాత్రి బ్రహ్మోత్సవాల విజయవంతంలో మీడియాదే కీలక పాత్ర అని, ఈ ఏడాది నిర్వహించే ఉత్సవాలను సైతం అదే తరహాలో విజయవంతం చేయాలని కోరారు. మీడియాకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో పాలకమండలి, ఆలయ అధికారులు సమన్వయంతో ఉత్సవాల నిర్వహణకు అని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కలిగేలా దృష్టి సారించినట్లు చెప్పారు. మహాశివరాత్రి, లింగోద్భవం రోజున ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేసి సామాన్య భక్తులకు సైతం లింగోద్భవ దర్శనం కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.